క్లుప్తంగా

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

• డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

కొడవలూరు: ప్రతి ఒక్కరికి వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు సామాజిక పరిశుభ్రత అవసరమని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుధ్యంపై మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగతంగా, సామాజికంగా పరిశుభ్రత పాటించకుంటే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.రుక్మిణి, సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు పుష్ప, సుశీల, కోశాధికారి ప్రవీణ, సీసీలు కె.ఉదయ్‌కుమార్, మమత, శోభ, శ్రీదేవి, సుకన్య పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం నేడు

విడవలూరు/కొడవలూరు : వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డికి బుధవారం కోవూరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున స్వాగతం పలకనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నార్తురాజుపాళెంలోని బైపాస్‌రోడ్డు మీదుగా నెల్లూరుకు వెళ్తున్న సందర్భంగా వంద కార్లలో బయలుదేరి స్వాగతం పలకనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, కొడవలూరు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గంధం వెంకటశేషయ్య తెలియజేశారు.

7 నుంచి శివరాత్రి మహోత్సవాలు

పొదలకూరు : ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని దేవస్థానం ప్రధానార్చకుడు పీబీఎస్వీ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శివాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గురువారం అంకురారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 12న ధ్వజారోహణం, రాత్రి ఏకాంత సేవతో ముగుస్తాయని తెలిపారు. చొప్పా వెంకటేశ్వర్లు, కె.కృష్ణమనాయుడు, ఎస్.ప్రసాద్, దుర్గారావు, కుమార్‌స్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం రేపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : కోవూరు పట్టణం రుక్మిణి కల్యాణ మండపంలో ఈనెల 7న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరుగుతుందని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

వేలంపాటలు నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పనులకు బుధవారం టెండర్లు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయానికి రావాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ




రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి

పొదలకూరు : జగనన్న లేఅవుట్‌లో పేదలకు అందజేసిన ఇంటి నివేశన స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పట్టాలను మండలంలోని మహ్మదాపురం సచివాలయంలో మంగళవారం ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 103 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేసినట్లు వీఆర్వో వెంకటేశ్వర్లు వెల్లడించారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

భద్రతకు అధిక ప్రాధాన్యం

• పోర్టు సీఈఓ జీజే రావు



పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఈఓ జీజే రావు

పొదలకూరు (ముత్తుకూరు) : అదాని కృష్ణపట్నం పోర్టులో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. పోర్టులో మంగళవారం తలపెట్టిన 53వ భద్రత వారోత్సవాలను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించి, ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలయ్యేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామన్నారు. వ్యక్తిగత భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ఉద్యోగులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. సీఓఓ రాజన్‌బాబు, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, రమేష్‌బాబు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



సంక్షేమ కాంతులు.. ప్రగతి పరుగులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పొదలకూరు బిట్–2 సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టింది. ఇక్కడి అన్ని కాలనీల్లో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాయి. ఎవరితో పనిలేకుండా అర్హులు నేరుగా సచివాలయానికి వెళ్లి పథకాల కోసం దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం వల్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు నిలిచిపోయినా గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి ప్రజలు తీసుకుని వెళ్లడంతో వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించారు.

- మునుపెన్నడూ జరగని అభివృద్ధి నాలుగేళ్లలో..
- మారిన పొదలకూరు రూపురేఖలు
- రూ.10 కోట్లతో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్లు
- డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.23 కోట్లు పంపిణీ



పట్టణంలో కొత్తగా నిర్మించిన రైతు బజారు

పొదలకూరు : నాలుగున్నర ఏళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో పొదలకూరు సచివాలయం బిట్–2 పరిధిలో సుమారు రూ.10 కోట్ల పైచిలుకు అభివృద్ధి పనులు జరిగాయి. దీనికితోడు జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇదే సచివాలయ పరిధిలోని వినాయక మాన్యంలో రక్షిత తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడి నుంచే పట్టణంలోని 50 శాతం వీధులకు కండలేరు జలాలను అందజేసేందుకు అధికారులు పనులు చేయిస్తున్నారు. దీంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారు.

మెయిన్ రోడ్డు పక్కనే సచివాలయ భవనం

పొదలకూరు పట్టణం మెయిన్‌రోడ్డును ఆనుకునే రూ.49 లక్షలతో చక్కటి సచివాలయ భవనం నిర్మించి సేవలు అందిస్తున్నారు. దీన్ని మంత్రి కాకాణి చేతులమీదుగా ప్రారంభించారు. విలేజ్ హెల్త్‌క్లినిక్, ఆర్బీకే భవన నిర్మాణం, నాడు–నేడులో భాగంగా పుట్టాయగుంట ప్రాథమిక పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టారు. దీనికితోడు సచివాలయానికి దగ్గరలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనానికి రూ.17 లక్షలు వెచ్చించి పూర్తి చేశారు. ఈ భవనంలో పంచాయతీ సర్పంచ్, గ్రేడ్–1 సెక్రటరీ తదితరులు ఉండేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో పట్టణంలో తాగునీటి ఎద్దడి ఉండేది. అయితే ఇప్పుడు అలాంటి కష్టాలు లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవడం వల్ల వేసవిలోనే నీటి కష్టాలు లేకుండాపోయాయి. సైడ్‌డ్రెయిన్ అంటే తెలియని పట్టణంలో సందుగొందుల్లో సైతం మురుగు కాలువలను నిర్మించారు. ఆర్‌అండ్‌బీ మెయిన్‌రోడ్డుపై రూ.2 కోట్లతో సిమెంటురోడ్డును వేయించారు. దీంతో ప్రజలు సుఖవంతమైన ప్రయాణం చేస్తున్నారు.

పొదలకూరు బిట్–2 సచివాలయ పరిధిలో..
డీబీటీ లబ్ధిదారుల సంఖ్య 4,889 మంది
బ్యాంకులో జమైన నగదు రూ.14,89,08,029
నాన్‌డీబీటీ లబ్ధిదారుల సంఖ్య 1,800 మంది
నగదు రూపంలో రూ.8,55,12,441



పొదలకూరు బిట్–2 సచివాలయ భవనం



శ్రామిక నగర్ గిరిజన కాలనీలో నిర్మించిన సిమెంటురోడ్డు

మా కాలనీ రూపురేఖలు మారాయి



మా శ్రామిక నగర్ గిరిజన కాలనీ రూపురేఖలు పూర్తిగా మారాయి. అన్ని వీధుల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాలువను నిర్మించారు. ఇళ్లు లేనివారికి పక్కా ఇళ్లను మంజూరు చేయించారు. అంగన్‌వాడీ భవనం, శ్రామిక నగర్ వరకు సిమెంటురోడ్డు, వీధి లైట్లు వేయించారు. కాలనీలో స్థలాల విలువ బాగా పెరిగింది.

– గిలకా సంపూర్ణ, శ్రామిక నగర్, పొదలకూరు

ఉద్యమంలా అభివృద్ధి



బిట్–2 సచివాలయ పరిధిలో ఉద్యమంలా అభివృద్ధి పనులు చేపట్టాం. సీసీరోడ్లు, సైడ్‌డ్రెయిన్లు, కాలనీల్లో అవసరమైన అభివృద్ధి పనులను మంత్రి కాకాణి పూర్తి చేయించారు. ఆయన రుణం తీర్చుకోలేం.

– సోమా రామకృష్ణయ్య, స్థానికుడు, పొదలకూరు

మంత్రి చొరవతో సాధ్యం



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ వల్లనే పట్టణంలో అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయి. నాయకులు మంత్రిని అడిగిన వెంటనే నిధులు కేటాయించి వెంటపడి పనులు చేయించారు. ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేయించిన ప్రభుత్వాలు గతంలో రాలేదు.

– మల్లిక చిట్టెమ్మ, సర్పంచ్, పొదలకూరు

విరివిగా సిమెంటురోడ్లు



అడిగిన ప్రతివీధిలో సిమెంటురోడ్ల నిర్మాణం విరివిగా నిర్మించడం జరిగింది. సిమెంటురోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చాలావేగంగా చేపట్టారు. ప్రస్తుతం పట్టణంలో మట్టిరోడ్డు ఉన్న వీధే లేదు.

– ప్రసాద్, పీఆర్ ఏఈ, పొదలకూరు

బ్యాంక్ అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వవ్వేరు కో–ఆపరేటివ్ బ్యాంక్ అభివృద్ధికి పాటుపడాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వవ్వేరు కో–ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో బ్యాంక్ చైర్మన్‌గా టంగుటూరు మల్లికార్జునరెడ్డి, సభ్యులుగా అల్లం శ్రీనివాసులు, మల్లు జయరామిరెడ్డి మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలోనే మల్లికార్జునరెడ్డికి చైర్మన్‌గా అవకాశం వచ్చిందని, అనివార్య కారణాల వల్ల ఆ సమయంలో వేరే వ్యక్తికి ఇచ్చినట్లు తెలిపారు. ఆలస్యంగానైనా అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. బ్యాంక్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేయగల సమర్థుడు మల్లికార్జునరెడ్డి అని కొనియాడారు. డిపాజిటర్ల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలన్నారు. గతంలో బ్యాంక్ చైర్మన్‌గా పనిచేసి అవినీతికి పాల్పడిన వారిపై విచారణ చేయించాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. బ్యాంక్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గతంతో సంబంధం లేకుండా బ్యాంక్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, బ్యాంక్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

• కలెక్టర్ హరినారాయణన్

కోవూరు : ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని దామరమడుగు, పెనుబల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, సాల్మన్‌పురంలో నిర్మాణంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఓటర్ల వివరాలు, గతంలో ఏమైనా గొడవలు జరిగాయా అనే విషయాలపై ఆరా తీశారు. ఓటు హక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులను సంప్రదించి తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉందో ముందుగా తెలుసుకోవాలని సూచించారు.



దామరమడుగు పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరాతీస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే తీవ్రమైన కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, తహసీల్దార్ సురేష్‌బాబు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీ–విజిల్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

కోవూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎఫ్ఎస్ బృంద సభ్యులు సీ–విజిల్ యాప్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కోవూరు ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐదు మండలాలకు సంబంధించిన ఎఫ్ఎస్ బృంద సభ్యులకు సీ–విజిల్ యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సీ–విజిల్ యాప్‌లో నమోదు చేసుకుని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ విజయశ్రీ పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు జాబితా ప్రకటన

పొదలకూరు : అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 2023–24 రబీ సంవత్సరానికి ఈ–క్రాప్ నమోదు జాబితాను మంగళవారం ప్రకటించామని ఏఓ యు.గీతాకుమారి తెలిపారు. సంబంధిత రైతులు ఆర్బీకేల్లో పరిశీలించి మార్పులు, చేర్పులు చేపట్టాల్సి వస్తే వ్యవసాయశాఖ దృష్టికి తీసుకు రావాల్సిందిగా సూచించారు. రైతులకు ఈ–క్రాప్ నమోదు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. పండించిన పంటలు గిట్టుబాటు ధరలకు విక్రయించాలన్నా, పంట నష్ట పరిహారం పొందాలన్నా ఈ–క్రాప్ బుకింగ్ ఉండాలన్నారు.

పల్లెల్లో చిచ్చుపెట్టడం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

• సోమిరెడ్డిపై వైఎస్సార్‌సీపీ నేతల ఫైర్

తోటపల్లిగూడూరు : పచ్చని పల్లెల్లో చిచ్చుపెట్టడం, తద్వారా రాక్షసానందం పొందడం సోమిరెడ్డికి తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు పేర్కొన్నారు. వరిగొండ పంచాయతీ జగనన్న కాలనీలో మంగళవారం ఉదయం సోమిరెడ్డి పర్యటించి ఇళ్ల నిర్మాణాలపై అనవసర విమర్శలు చేయడాన్ని వారు తప్పుపట్టారు. ఈ మేరకు వరిగొండ జగనన్న కాలనీలో గిరిజనులైన లబ్ధిదారులతో కలిసి వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వాస్తవాలను వివరించారు. గత టీడీపీ హయాంలో మండలంలో ఒక్క కాలనీనైనా నిర్మించిన దాఖలాలు ఉన్నాయా అంటూ సోమిరెడ్డికి సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలంలో దాదాపు 46 జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి వేలాది మందికి పక్కా ఇళ్లను నిర్మిస్తున్న సంగతి సోమిరెడ్డి గుర్తించుకోవాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకోలేని పేద గిరిజనులకు పార్టీ నాయకులు ముందుకొచ్చి ఇళ్ల నిర్మాణాలను చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగా గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి చేపట్టిన 50 ఇళ్లు వివిధ దశల్లో సాగుతున్నాయన్నారు. పనుల విషయంలో గిరిజనులకు ఎలాంటి ఆందోళన, అసంతృప్తి లేదన్నారు. పార్టీ నేతలు కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జి.విష్ణుమోహన్‌రెడ్డి, కె.శేఖర్‌రెడ్డి, ఎన్.సునీల్‌రెడ్డి, సి.ప్రవీణ్‌రెడ్డి, కె.రవీంద్రయ్య, సర్పంచ్ ఈ.సుబ్బరత్నమ్మ, ఉపసర్పంచ్ జె.హరి, అశోక్, జగదీష్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీ పరిశీలన

కోవూరు : కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ప్రయోగశాలలను లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డుల గురించి ఆరాతీశారు అనంతరం ఎక్స్‌రే కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజేత, వైద్యులు వెంకటాచలపతి గౌడ్, పెంచలయ్యతో ప్రత్యేకంగా సమీక్షించారు. డీసీఎం సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ కిశోర్ ఉన్నారు.

సలహాలు, సూచనలు పాటించాలి

కోవూరు : వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను రైతులు తప్పక పాటించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శివన్నారాయణ అన్నారు. కోవూరు మండలంలోని పాటూరు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రవేత్తలతో కలిసి వరి పొలాలను పరిశీలించి వివిధ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి యాజమాన్యం, రసాయన ఎరువుల వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త పి.మధుసూదన్‌రావు, ఆత్మ వ్యవసాయాధికారి ఈ.శైలజాకుమారి, ఏఓ ఇందిరావతి, సహాయకులు మౌనిక, చైతన్య పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్ కె.రేణుక మండలంలోని బీఎల్వోలకు ఓటు హక్కు వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. బూత్ లెవల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం, ఓటింగ్ శాతం పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ప్రతి ఒక్కరినీ చైతన్య పరిచి ఓటువేసేందుకు బూత్ వద్దకు వచ్చే విధంగా బీఎల్వోలు వివరించాల్సిందిగా సూచించారు.

సోమిరెడ్డీ.. రాజకీయ సన్యాసం తీసుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పొదలకూరు (ముత్తుకూరు) : సర్వేపల్లి టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు వేరే వారి పేర్లు సర్వే చేయిస్తున్న నేపథ్యంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాజకీయ సన్యాసం తీసుకోవడం ఉత్తమమని వైఎస్సార్‌సీపీ నేతలు సలహా ఇచ్చారు. మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్, ఉపసర్పంచ్‌లు అల్లంపాటి గోపాల్, రాగాల వెంకటేశ్వర్లు తదితరులు స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నాలుగుసార్లు వరుసగా ఓటమిపాలై, అవినీతికి చిరునామాగా మారిన సోమిరెడ్డిని సొంత పార్టీ శ్రేణులే అభ్యర్థిగా అంగీకరించడం లేదన్నారు. ఇంటికే పరిమితమై విశ్రాంతి తీసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు. అహర్నిశలు అభివృద్ధికి శ్రమిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని విమర్శించే స్థాయి సోమిరెడ్డికి లేదన్నారు. ఎంపీటీసీ సభ్యుడు షేక్ నవీద్, గండవరం సూరి, టి.రాజ పాల్గొన్నారు.

అధ్యాపకునికి రాష్ట్రస్థాయి అవార్డు

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకునికి రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని సీఎంఆర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో కళాశాలకు చెందిన సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ వెంకట నాగేంద్రకు 'ఇన్నోవేటివ్ టీచింగ్ ఎక్సలెన్స్' అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రను ఆ కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ప్రిన్సిపల్ వి.అనిల్‌కుమార్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.



అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు వెంకట నాగేంద్ర

పోలియో రహిత సమాజమే లక్ష్యం

• మండలంలో వంద శాతం పూర్తి



పొలాల వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సీహెచ్‌ఓ రాజయ్య

మనుబోలు : పోలియో రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజయ్య అన్నారు. మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మూడో రోజు మంగళవారం పొలాల వద్ద నివాసముంటున్న చల్లా యానాదులు, రొయ్యల గుంతల వద్ద కాపలాగా ఉన్న వారు, ఎస్టీ కాలనీల్లో పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. దీంతో మండలంలో 100 శాతం పూర్తయినట్లు వెల్లడించారు. మండలంలో ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులు 4,568 మంది ఉండగా అందరికీ చుక్కలు వేసినట్లు తెలిపారు. ఇందుకోసం మండలంలో గ్రామాల వారీగా 40 బూత్‌లు, ఒక మొబైల్ బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గేయ పూజిత, డాకర్ మోహిసినా సుల్తానాలతో పాటు 45 మంది వ్యాక్సినేటర్‌లు పోలియో చుక్కలు వేశారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు హైమావతి, వెంకట రమణయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, మురళీకృష్ణ ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.